Andhra Jyothi Dt- 16/02/14

## మధురానగర్‌లో
# తరుణి మెట్రోస్టేషన్

- మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు
- యూసుఫ్‌గూడలో యువతకు పెద్ద పీట

17

# మెట్రో ప్రాజెక్టులో ప్రత్యేక స్టేషన్లు

- మధురానగర్‌లో మహిళల కోసం 'తరుణి'
- యూసుఫ్‌గూడలో యువతకు, మియాపూర్- ఉప్పల్‌లో పిల్లలకు



మెట్రో పనులను సమీక్షిస్తున్న జేపీ, హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ: నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి వస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో స్టేషన్ల నిర్మాణాన్ని ప్రత్యేకంగా చేపట్టనున్నారు. స్టేషన్లను అందుబాటులోకి తీసుకుని వస్తూనే కొన్ని స్టేషన్లను ప్రత్యేకంగా మహిళలు.., యువత.., పిల్లల కోసం ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టేషన్లలో ఆయా వర్గాలకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచనున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. శనివారం భరత్‌నగర్ నుంచి మియాపూర్ వరకూ మెట్రో ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును మీడియాతో కలిసి రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా నాగోల్ నుంచి శిల్పారామం మెట్రో కారిడార్ మధురానగర్‌లో ఏర్పాటు కానున్న మెట్రో స్టేషన్‌లో మహిళల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. దీని పేరును 'తరుణి' స్టేషన్‌గా నామకరణం చేసినట్టు వివరించారు. అలాగే యూసుఫ్‌గూడ స్టేషన్‌ను 'యువత' కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఇక మియాపూర్- ఉప్పల్ స్టేషన్లను పిల్లల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌ను సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ఉన్న గోడౌన్‌కు తరలించనున్నట్టు తెలిపారు.

**క్లిష్టంగా మారిన కారిడార్..**

భరత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన భూ పరీక్షల్లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఇక్కడ మెట్రో రైలు పనులకు ఆటంకాలు ఎదురయ్యాయి. పిల్లర్ల కోసం తవ్వుతున్న చోట గల్ల మట్టి రావడంతో అప్రమత్తమైన అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 60 అడుగుల లోతు తవ్వి కాంక్రీట్ పోసి పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారు.

**2015 ఆగస్టులో ..**

మియాపూర్- ఎస్ఆర్ నగర్ కారిడార్ మెట్రో రైలు కారిడార్ పనులు 2015 నాటికి పూర్తి అవుతాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అదే సంవత్సరం ఆగస్టు 15న మెట్రో రైలును ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. భరత్‌నగర్‌లో రైల్ ఓవర్ బ్రిడ్జి వల్ల, మూసాపేటలో ఆస్తుల సేకరణలో వచ్చిన సమస్యల వల్ల పనుల్లో జాప్యం జరిగినట్టు తెలిపారు.

**ఈ కారిడార్‌లో చేపట్టిన పనులు**

- రూ. 49 లక్షలతో కూకట్‌పల్లి బస్ డిపో వద్ద వరద నీటి కాలువ నిర్మించారు.
- రూ. 20.5 లక్షలతో మూసాపేట శ్మశాన వాటిక పరిసరాల్లో వరద నీటి కాలువ
- రూ. 40 లక్షలతో భరత్‌నగర్ మెట్రో కారిడార్‌కు ఎడమ వైపున వరద నీటి కాలువ
- రూ. 49.5 లక్షలతో పెట్రోల్ బంక్ నుంచి మూసాపేట వరకూ వరద నీటి కాలువ
- రూ. 49.5 లక్షలతో భరత్‌నగర్ రైల్ ఓవర్ బ్రిడ్జి కింద వరద నీటి కాలువ
- రూ. 9.5 లక్షలతో శ్రీ సాయి ట్రావెల్స్ నుంచి సంతోష్ యాదవ్ ఇంటి వరకూ వరద నీటి కాలువ
- కల్పనా టింబర్ డిపో నుంచి హరికృష్ణ కమర్షియల్ కాంప్లెక్స్ వరకు క్యారేజ్ వే నిర్మాణం. రూ. 49.5 లక్షల వ్యయం
- చందులాల్ పటేల్ ఇంటి నుంచి నర్సింగ్ రావు ఇంటి వరకు రోడ్డు విస్తరణ క్యారేజ్ వే నిర్మాణం. దీనికి రూ. 49.5 లక్షల వ్యయం
- ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూమ్ నుంచి మూసాపేట కారిడార్- 1 వరకు రూ. 42 లక్షలతో రహదారి విస్తరణ.. పునర్నిర్మాణం పనులు